సాక్షి
తిరుపతి

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



జాలర్లకు ఇళ్ల స్థలాలు

తడ మండలం దీవి గ్రామం ఇరకంలో నివసిస్తున్న 172 మంది జాలర్లకు ఇళ్ల పట్టాలను కలెక్టర్ అందించారు. - IIలో



ఇదేం తీరు అధ్యక్షా?

జెడ్పీ సర్వసభ్య సమావేశం ప్రతిసారి నామమాత్రంగా నిర్వహించి మమ అనిపిస్తున్నారు. - IIలో



భలే కేటుగాళ్లు..!

సెల్ ఫోన్లు చోరీ చేసి వాటి ద్వారా బాధితుల బ్యాంకు ఖాతాల నుంచి నగదు హాంఫట్ చేస్తున్న కేటుగాళ్లు అరెస్టయ్యారు. - IIలో

న్యూస్‌రీల్

ఎస్వీ వైద్య కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థికి అడ్మిషన్ ధ్రువపత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాలలో నీట్–2025 తొలి విడత ఎంబీబీఎస్ ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు గురువారం ఉత్తమ ర్యాంక్ సాధించిన తిరుపతికి చెందిన గుణ భూషణ్‌కు ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు తొలి అడ్మిషన్ ధ్రువపత్రాన్ని అందించారు.

ఉత్తమ టీచర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలకు హాజరైన ఉపాధ్యాయులు

తిరుపతి సిటీ : జిల్లాలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించారు. సెప్టెంబర్ 5వ తేదీ టీచర్స్‌డే సందర్భంగా విజయవాడ కేంద్రంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను అందించనున్నారు. ఇందులో భాగంగా జిల్లా నుంచి 41 మంది ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు అందాయి. డీఈఓ కేవీఎన్ కుమార్ ఆధ్వర్యంలోని కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించి ఇద్దరు ప్రధానోపాధ్యాయులు, నలుగురు స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు సెకండరీ గ్రేడ్ టీచర్లను మొత్తం ఎనిమిది మందిని ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనుంది. ఇందులో నుంచి నలుగురుని ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రభుత్వం ఎంపిక చేసి సెప్టెంబర్ 5న అవార్డులను అందించనుంది.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో విద్యార్థినికి పతకం



యామిని

ఏర్పేడు : ఈనెల 8, 9వ తేదీలలో గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జూడో జట్టుకు ప్రతినిధ్యం వహించిన ఏర్పేడు మండలం పాపానాయుడుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని యామిని 40 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు హెచ్ఎం మారయ్య తెలిపారు. జూడో పోటీలలో ప్రతిభ కనబరిచిన ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

● సైకత రూపం.. భక్తి భావం



79వ దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలకు ముందస్తుగా గురువారం సైకత శిల్పి తనదైన శైలిలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ ఐలవ్ మై ఇండియా అనే సైకత శిల్పాన్ని రూపొందించి శుభాకాంక్షలు తెలియజేశారు. - చిల్లకూరు

మువ్వన్నెల వెలుగులు



స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించేందుకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో ముందస్తు ఏర్పాట్లను విమానాశ్రయ అధికారులు చేశారు. అందులో భాగంగా టర్మినల్ భవనానికి విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన మువ్వన్నెల వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. - రేణిగుంట

ఆంక్షల బస్సు

ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. ఏడాదికి పైగా ఊరించి ఉసూరుమనిపించారు. నేడు ఉచిత బస్సు ప్రకటనపై..షరతులు వర్తిస్తాయంటూ ప్రభుత్వం ఎన్నో మెలికలు పెట్టింది. గతంలో రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితమని ఆర్భాటం చేశారు. కానీ నేడు అమల్లోకి వచ్చేసరికి కొన్ని బస్సుల్లోనే ఉచితం అంటూ ఆంక్షలు పెట్టడంపై మహిళా లోకం మండిపడుతోంది. పల్లె వెలుగులో సుదూర ప్రాంతాలకు సాధ్యమయ్యేపనికాదని మహిళలు నిట్టూరుస్తున్నారు. ఇంతదానికి హామీలు ఇవ్వడం దేనికంటూ ఆవేదన వ్యక్తం అవుతోంది.

సాధారణ బస్సుల్లో మాత్రమే ఉచితం

- అల్ట్రా, పల్లె వెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్‌లలో మాత్రమే అవకాశం
- రాష్ట్ర మంతా ఉచితంగా వెళ్లాలంటే వీటిలో సాధ్యమేనా?
- తిరుమలకు వెళ్లాలన్నా టికెట్ కొనాల్సిందే.. ఉచితంలో అన్నీ షరతులే
- కడుపు కొడుతున్నారంటూ ఆటో వాలాలు, టాక్సీ డ్రైవర్ల ఆందోళన

సాక్షి ప్రతినిధి, తిరుపతి : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ప్రభుత్వం ఎన్నో మెలికలు పెట్టింది. 15 నెలల తరువాత అమలు చేయనున్న ఈ పథకంలో అన్ని బస్సుల్లో ఉచితం కాదు. కొన్ని బస్సుల్లో మాత్రమే. అవి కూడా అరకొర బస్సులు.. అందులోనూ డొక్కు బస్సుల్లో మాత్రమే. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అంతంతే.. అరకొర బస్సుల్లో ఉచితంపై ఆటో, టాక్సీ వాలాలు భగ్గుమంటున్నారు. ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి భయపడి కూటమి నేతలు ప్రభుత్వం ఏర్పాటై ఏడాది తరువాత నేటి సాయంత్రం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

తిరుపతి, చిత్తూరు జిల్లాలో మొత్తం 24 లక్షల మందికిపైగా మహిళలు ఉన్నారు. అయితే ఆర్టీసీ బస్సులు మాత్రం కేవలం 1418 మాత్రమే ఉన్నాయి. ఇందులోనూ ఉచిత ప్రయాణానికి అవకాశం ఉన్న బస్సులు కేవలం 663 బస్సులు మాత్రమే. మిగిలిన 755 బస్సుల్లో ప్రయాణించాలంటే టికెట్ కొనాల్సిందే. తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి రావాలన్నా టికెట్ కొనక తప్పదు.

హవ్వ..పల్లె వెలుగులో రాష్ట్రం అంతా!.

పథకాల అమలులో నిబంధనలు పెట్టి తాము అమలు చేస్తున్నాం అని చెప్పుకోవడంపై జనాలు మండిపడుతున్నారు. రాష్ట్రంలో ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లి రావాలంటే పల్లెవెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేసే వీలుంటుందా? అని ప్రశ్నిస్తున్నారు. ఉదాహరణకు విజయవాడకు వెళ్లి రావాలంటే నేరుగా పల్లెవెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వెళ్లి రాగలమా? అని ప్రశ్నిస్తున్నారు. ఆ బస్సుల్లో ప్రయాణిస్తే ఎన్ని బస్సులు మారాలి? ఎప్పుడు గమ్యస్థానానికి చేరాలి? తిరిగి నివాసానికి ఎప్పుడు రావాలి? అని నిలదీస్తున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లా ప్రజలు తమ చెంతే ఉన్న తిరుమలకు వెళ్లి రావడానికి వీలులేని ఉచిత బస్సులు ఎందుకు? అని నిట్టూరుస్తున్నారు.





తిరుపతి : మెడకు ఉరి తగిలించుకొని ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల నిరసన

ఉపాధి చూపించాలని నిరసనలు

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా.. పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న తిరుపతి, చిత్తూరు జిల్లాలో నిత్యం 70 నుంచి లక్ష మంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్తుంటారు. పర్యాటకులు, భక్తులపై ఆధారపడి అనేక మంది నిరుద్యోగులు అప్పులు చేసి ఆటోలు, టాక్సీలు కొనుగోలు చేసి తిప్పుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మహిళలకు ఉచితం పేరుతో ఉన్న కొన్ని బస్సులు వారికి కేటాయిస్తే తమ పరిస్థితి ఏంటని ఆటో, టాక్సీ వాలాలు కూటమి నేతలను ప్రశ్నిస్తున్నారు. అందులో భాగంగా గురువారం తిరుపతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉచిత ప్రయాణం ఇస్తే ఇవ్వండి అయితే తమకు ఉపాధి అవకాశాలు చూపించమని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తిరుపతి జిల్లాలో మొత్తం బస్సులు	955
చిత్తూరు జిల్లాలో మొత్తం బస్సులు	463
మొత్తం	1418

ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉన్న బస్సులు

పల్లె వెలుగు	506
అల్ట్రా పల్లె వెలుగు	06
సాధారణ ఎక్స్‌ప్రెస్‌లు	151
మొత్తం	663

ఈ బస్సుల్లో ప్రయాణించాలంటే టికెట్ కొనాల్సిందే!

సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ విద్యుత్ బస్సులు, అమరావతి, ఇంద్ర తిరుమలకు వెళ్లి వచ్చే బస్సులు

దుర్గమ్మ గుడికి వెళ్లాలంటే ఎన్ని రోజులు



ఉచిత బస్సు ప్రయాణం బాగానే ఉంది. నేను విజయవాడ దుర్గమ్మ గుడికి వెళ్లి రావాలంటే పల్లె వెలుగు బస్సులో వెళ్లి ఎప్పుడు రావాలి? ఆ పల్లె వెలుగు బస్సులు ఎన్ని మారాలి? ఇది అయ్యే పనేనా నాయనా? కాణిపాకం వెళ్లి రావాలన్నా పల్లె వెలుగు బస్సులో ఎప్పుడు వెళ్లి రావాలి?

– సరోజమ్మ, తిరుపతి

ఉపాధి అవకాశాలు కల్పించండి



మా తల్లిదండ్రులు పెద్ద చదువులు చదివించలేకపోయారు. చదివిన చదువుతో ఉద్యోగాలు దొరకడం లేదు. అప్పు చేసి ఆటో కొనుగోలు చేశా. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటున్నారు. ఇస్తే ఇవ్వండి.. కానీ మాకు ఉపాధి అవకాశాలు కల్పించండి. ఉపాధి లేకపోతే మా పరిస్థితేంటి.?

– జ్ఞానశేఖర్, ఆటోడ్రైవర్ , చిత్తూరు

జెండా పండుగకు సిద్ధం

- తారకరామా స్టేడియంలో వేడుకలు
- 10 స్టాల్స్, 9 శకటాలు
- ఉత్తమ పురస్కారాలకు 391 మంది ఎంపిక

తిరుపతి అర్బన్ : జాతీయ జెండా పండుగను ఘనంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేపట్టారని కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని తారకరామా స్టేడియం వేదికగా సర్వం సిద్ధం చేశామన్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ, పోలీస్ గౌరవ వందనం స్వీకరించడానికి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరుకానున్నారని చెప్పారు. ఉదయం 9 గంటలకే జెండా ఆవిష్కరణ ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి సందేశం, శకటాల ప్రదర్శన, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు జారీ, తర్వాత స్టాల్స్ సందర్శన ఉంటుందని వివరించారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి పురస్కారాలను అందించనున్నామని స్పష్టం చేశారు. జిల్లాలో 391 మందిని ఉత్తమ పురస్కారాలకు ఎంపిక చేశామని చెప్పారు. అదేవిధంగా 10 స్టాల్స్, 9శకటాలను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. జెండా పండుగకు అంతా ఆహ్వానితులేనని చెప్పారు. ఆ దిశగా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగంలో పదవులు

తిరుపతి అర్బన్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు యువ నేతలకు రాష్ట్ర యువజన విభాగ కమిటీలో వివిధ హోదాల్లో పదవులు కల్పించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఆ జాబితాను ప్రకటించింది. పుంగనూరు నియోజకవర్గానికి చెందిన మిద్దింటి కిషోర్‌బాబుకు రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ, శ్రీకాళహస్తి అసెంబ్లీ పరిధిలోని కంతా ఉదయకుమార్ సెక్రటరీ, డీజే సుధీర్‌కుమార్ జాయింట్ సెక్రటరీగా అవకాశం కల్పించారు.

- తిరుపతి జిల్లా, ఏర్పేడు మండలం, ముసిలిపేడు పరిధిలోని కొందరు ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 100 మందికి పట్టాలు మంజూరయ్యాయని రెవెన్యూకు చెందిన కింది స్థాయి అధికారి ఒకరు, టీడీపీ నాయకుడు కలిసి లబ్ధిదారులకు సమాచారం ఇచ్చారు. ఆపై ఒక్కొక్కరూ అడిగినంత ఇచ్చుకోవాలని వారు సదరు లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఒత్తిడి చేస్తున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారి స్థాయిని బట్టి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అడిగినంత ఇవ్వకపోతే మంజూరైన పట్టా రద్దు చేస్తానని బెదిరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తాను వసూళ్లు చేసే డబ్బులు అందరికీ పంచాలని, అడిగినంత ఇస్తే ఏకంగా రిజిస్ట్రేషన్ కూడా చేసి ఇస్తానని నమ్మబలుకుతున్నట్లు సమాచారం.
- చిత్తూరు నగరం, రూరల్ పరిధిలో నివాస స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో నమోదు కోసం స్థానిక అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఆన్‌లైన్ కోసం, అఫిడవిట్ కోసం అంటూ రూ.500 అడుగుతున్నారు. అలా ఇప్పటికే అనేక మంది రూ.500 చొప్పున చెల్లించారు కూడా. ఆపై ఇంటి స్థలం మంజూరు కావాలంటే అడిగినంత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నగర పరిధిలో ఇంటి స్థలం కావాలంటే రూ.25వేలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. డబ్బులు ఇవ్వకపోతే ఇంటి స్థలం మంజూరు చేసే పరిస్థితి లేదని తెగేసి చెబుతున్నట్లు ఆవేదన చెందుతున్నారు.



పైసలిస్తేనే ఇంటి పట్టా!

.. ఇవి మచ్చుకు రెండు ఘటనలు మాత్రమే. చిత్తూరు, తిరుపతి జిల్లాలో అధికారులు, టీడీపీ నేతలు బరితెగించేశారు. పేదల అమాయకత్వాన్ని, అవసరాలను ఆసరాగా చేసుకుని చెలరేగిపోతున్నారు. వారు అడిగినంత ఇవ్వకపోతే మంజూరైన ఇంటి పట్టా కూడా రద్దు చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో చేసేది లేక లబ్ధిదారులు వడ్డీలపై అప్పులు చేసి వారు అడిగినంత సమర్పించుకుంటున్నారు.

పట్టణాల్లో ఓ రేటు.. పల్లెల్లో మరో రేటు

- ఒక్కొక్కరూ రూ.20వేల నుంచి రూ.30వేలు ఇవ్వాలంట
- అడిగినంత ఇస్తేనే ఇంటి స్థలం మంజూరు
- కొత్తగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులపై ఒత్తిళ్లు
- వసూలైన డబ్బులు కింద స్థాయి నుంచి పై స్థాయి వరకు పంచాలంట
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అధికారులు, టీడీపీ నేతల వసూళ్ల పర్వం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: పేద, మధ్య తరగతి వారి కల సొంత ఇల్లు. ఆ కలను సాకారం చేసుకునేందుకు చేయని ప్రయత్నం అంటూ ఉండదు. అటువంటి వారిని దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎటువంటి రుసుము తీసుకోకుండా ఉచితంగా నివాస స్థలాలను కేటాయించింది. అవసరాన్ని బట్టి ప్రైవేటు భూములను సైతం కొనుగోలు చేసి ప్లాట్లు వేసి పేదలకు పంపిణీ చేసింది. అంతటితో ఆగకుండా పక్కాగృహాలు నిర్మించి ఇచ్చింది కూడా. ఇంటి స్థలాలు మంజూరు నుంచి నివాసాల్లో చేరేంత వరకు లబ్ధిదారులపై అధికారుల నుంచి ఎటువంటి ఒత్తిడీ ఉండేది కాదు. అదనంగా రూపాయి కూడా డిమాండ్ చేసిన దాఖలాలు లేవు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జగనన్న కాలనీల్లో నిర్మాణాలు చేపట్టకుండా ఆపేశారు. చెల్లించాల్సిన బిల్లులు ఆటకెక్కించేశారు. అనేక ప్రాంతాల్లో జగనన్న కాలనీలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. లబ్ధిదారులే కొందరు సొంత డబ్బులు వెచ్చించి నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. ఇల్లులేని పేద వారికి నివాస స్థలాలు కేటాయించనున్నట్లు, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. దరఖాస్తు చేసుకోవడం నుంచి నివాస స్థలం మంజూరు, పక్కా భవన నిర్మాణం కోసం, విద్యుత్ సౌకర్యం కోసం అంటూ మామూళ్లకు తెగబడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నట్లు అర్హులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వసూళ్లు షురూ!

కూటమి ప్రభుత్వం నివాస స్థలాల కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. కానీ ఈ విషయంపై చాలా మందికి అవగాహన లేక చాలా మంది దరఖాస్తు చేసుకోలేదు. చిత్తూరు జిల్లాలో కేవలం 1,478 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు గ్రామ కంఠాలు, లే అవుట్లలో పట్టాలు ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. గ్రామ కంఠాలు లేని ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుని అందులో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామ కంఠాలు, లే అవుట్లు, ఆక్రమణకు గురైన స్థలాలు లేకపోతే భూములు కొనుగోలు చేస్తారా? లేదా? అనే విషయంపై స్పష్టత లేదు. ఇదిలా ఉంటే.. దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరిని కింది స్థాయి అధికారులు డబ్బులు వసూళ్లకు తెరలేపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందులో భాగంగా ఏర్పేడు మండలం, ముసిలిపేడు గ్రామానికి చెందిన కొందరు లబ్ధిదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో కలెక్టరేట్‌లో ఉన్న కొందరు మీడియా వారిని కలిసి ఇళ్ల స్థలాల పేరుతో జరుగుతున్న తతంగాన్నంతా వివరించడం గమనార్హం. తిరుపతి, రేణిగుంట, చిత్తూరు వంటి ప్రాంతాల్లో ఇంటి స్థలాలు కావాలంటే అధికారులు ఇంకెంత డిమాండ్ చేస్తారోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి వసూళ్లకు పాల్పడుతున్న కింది స్థాయి అధికారులు, టీడీపీ శ్రేణులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అగ్రకులాల దౌర్జన్యాలపై చర్యలు తీసుకోండి



వెటర్నరీ వీసీతో మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం నేతలు

చంద్రగిరి : వెటర్నరీ యూనివర్సిటీలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే బీసీ విద్యార్థులపై అగ్ర కులాలకు చెందిన కొంత మంది దౌర్జన్యాలు చేయడంపై బీసీ సంఘం విద్యార్థులు మండిపడ్డారు. వెటర్నరీ యూనివర్సిటీలోని నకుల హాస్టల్లో విద్యార్థులకు అందించే అల్పాహారంలో పురుగులు రావడంతో ఓబీసీ విద్యార్థి సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు వార్డెన్ తిరుపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. అయితే వార్డెన్‌తో మాట్లాడుతున్న క్రమంలో కొంత మంది విద్యార్థులు నాగేశ్వర్‌రావుపై దౌర్జన్యానికి యత్నించడంతో బీసీ విద్యార్థులు మండిపడ్డారు. అనంతరం విద్యార్థి సంఘం నేతలు యూనివర్సిటీ వీసీకి ఫిర్యాదు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులతో కొంత మంది అగ్ర కులాలకు చెందిన వారు బెదిరింపులకు పాల్పడటం, గొడవలకు రావడం దారుణమన్నారు. వార్డెన్‌కు చెందిన కొంత మంది విద్యార్థి సంఘం నేత నాగేశ్వర్‌రావుపై దౌర్జన్యానికి పాల్పడటం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున బీసీ విద్యార్థి సంఘాలతో నిరసనకు దిగుతామని వీసీ ఎదుట స్పష్టం చేశారు. వీసీ కేవీ. రమణ మాట్లాడుతూ.. సోమవారం ఈ విషయమై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని విద్యార్థి సంఘ నేతలకు వివరించారు.

పనితీరుకు ర్యాంకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జోనల్ ఆఫీసర్ ఎంటీ కృష్ణబాబు

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ లక్ష్యం మేరకు కార్యక్రమాలను అమలు చేయడంలో పురోగతి చూపాలని ఇన్‌చార్జి జోనల్ ఆఫీసర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య , కుటుంబ సంక్షేమశాఖ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఆయన గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డీఆర్వో నరసింహులతో కలసి ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర, పీ4 కార్యక్రమాల పనితీరును తెలుసుకున్నారు. జిల్లాల వారీగా ర్యాంకింగ్ ఉంటుందని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే వ్యవసాయ, ఉద్యానశాఖ అభివృద్ధికి పనిచేయాలని చెప్పారు. కొత్త ఆలోచనలతో జిల్లాను అభివృద్ధి దిశగా తీసుకుపోవాలని ఆయన సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించడానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షించి పురోగతిని చూపుతామని చెప్పారు. అలాగే వ్యవసాయ, ఉద్యానశాఖల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

క్లుప్తంగా

20వ తేదీ వరకు 'అన్నదాత సుఖీభవ'కు అవకాశం

- అర్హులైన 3,115 మందికి జమ కాని నగదు

తిరుపతి అర్బన్: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు సంబంధించి తమ ఖాతాల్లో నగదు జమకాని వారు ఈ నెల 20 వరకు సరి దిద్దుకోవడానికి అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ పథకం కింద 1,54,908 మందికి నగదు జమ అయ్యిందని, అయితే 3,115 మందికి అర్హత ఉన్నప్పటికీ వారి ఖాతాల్లోకి నగదు జమ కాలేదని తెలియజేశారు. నగదు జమ కాని వారు ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసుకోవడంతోపాటు ఎన్‌పీసీఐకి మ్యాప్ చేసుకోవాలని, లేదంటే పోస్టల్ బ్యాంకు ఖాతాను ప్రారంభిస్తే నగదు జమ అవుతుందని పేర్కొన్నారు. ఈ పథకానికి అర్హులైన వారు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు అర్జీ ఇస్తే వారు అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో నమోదు చేస్తారని తెలియజేశారు.

స్కూలు వంట గదిలో గ్యాస్ లీకేజీ

- చెలరేగిన మంటలు
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



గ్యాస్ లీకేజీతో చెలరేగుతున్న మంటలు

పాకాల: గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగిన సంఘటన మండలంలోని రమణయ్యగారిపల్లె ఎంపీపీ పాఠశాలలో చోటు చేసుకుంది. గురువారం స్థానికులు తెలిపిన వివరాలు..స్కూలు వంట గదిలో వంట కార్మికురాలు ఆర్. ప్రవీణ గ్యాస్ స్టౌ మీద పాలు కాస్తుండగా గ్యాస్ లీకేజీ అయి మంటలు చెలరేగాయి. దీంతో వంట గది నుంచి ప్రవీణ కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, స్థానికుల సహకారంతో మంటలను నీళ్లతో తడిపిన గోతం సంచులతో ఆర్పారు. సమయానికి అందరూ స్పందించడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదని టీచర్లు ఊపిరి పీల్చుకున్నారు.



వేతనాల కోసం ధర్నా చేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లు(ఫైల్)

సమస్యలు గాలికి

గ్రామాల్లో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి నిర్వహించే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగుతోంది. ఇప్పటికి మూడు సార్లు నిర్వహించిన ఈ సమావేశాలతో ఒరిగింది శూన్యమే. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జెడ్పీటీసీలు సమస్యలు ఏకరువు పెడుతున్నా పట్టించుకునే వారు లేరు. ఈ సారైనా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తారో లేదో వేచి చూడాలి మరి..!

మొక్కుబడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- హాజరుకాని అధికార గణం
- పేరుకుపోతున్న బకాయిలు
- 16న జిల్లా పరిషత్ 4వ సర్వసభ్య సమావేశం

చిత్తూరు కార్పొరేషన్ : ప్రజాసమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చక్కటి వేదిక. ఇందులో అనేక సమస్యలు పరిష్కరించడమే కాకుండా అభివృద్ధి పనులు, కొత్త నిర్ణయాల అమలు పట్ల చర్చించవచ్చు. అయితే ప్రతి సారీ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న ఈ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగుతోంది. ఈ సమావేశం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లా పరిధిలో నిర్వహిస్తారు. ఈ మూడు జిల్లాల కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు హాజరైతే ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయి. అయితే ఇప్పటి వరకు తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు హాజరు కాలేదు. ఆయా జిల్లాల అధికారులు సైతం గైర్హాజరవుతున్నారు. దీంతో ఆయా జిల్లాల పరిధిలోని జెడ్పీటీసీలు సమావేశానికి హాజరై సమస్యలు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకుండా పోతోంది.

ప్రతిసారీ అజెండాలో తప్పిదాలే

జిల్లా పరిషత్ సర్వసమావేశానికి అందజేసే అజెండాలో అన్ని శాఖల పరిధిలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల సమాచారం పొందుపరచాలి. అయితే అనేక శాఖల అధికారులు అజెండాలో తమ శాఖకు చెందిన సమాచారమే ఇవ్వడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 29న నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అందజేసిన అజెండాలో కేవలం 11 శాఖల సమాచారమే పొందుపరిచారు. ఆ సమాచారంలోనూ అనేక తప్పిదాలున్నాయి. చివరి నిమిషంలో పలు శాఖలు సమాచారం అందజేస్తుండడంతో చాలా తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయి.

జాడలేని ఆర్థిక సంఘం నిధులు

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా వేధిస్తోంది. జెడ్పీ, పంచాయతీలకు కలిపి రూ.85 కోట్లు ఇవ్వగా వాటిని పల్లె పాలనకు కేటాయించాల్సి ఉంది. ఆ డబ్బులు మంజూరు చేయకుండా సతాయిస్తోందని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్లె పండుగ కింద పంచాయతీరాజ్ పరిధిలో రూ3.కోట్ల బిల్లులు రావాల్సి ఉంది.

సెస్ బకాయిలు రూ.36.4 కోట్లు

జిల్లాలోని గ్రంథాలయాలకు నగరపాలక, పంచాయతీల నుంచి వచ్చే సెస్ చెల్లించకుండా కూటమి ప్రభుత్వం వేధిస్తోంది. ప్రతినెలా ఉద్యోగుల జీతాలు, నిర్వహణ కలిపి మొత్తం రూ.80 లక్షలు అవుతుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో సెస్ బకాయిలు రూ.36.40 కోట్లు రావాల్సి ఉంది.

నూతన విద్యుత్ సర్వీసులకు మీనమేషాలు

ఉమ్మడి జిల్లాలో డబ్బులు కట్టించుకొని విద్యుత్ ఇవ్వాల్సిన సర్వీసులు 4 వేలకు పైగా ఉన్నాయి. శాఖా పరంగా కట్టిన డబ్బులకంటే పలుకుబడి, అధికారులకు మామూళ్లు ఇచ్చుకున్నవారికే సర్వీసులు జిల్లా స్టోర్స్ నుంచి త్వరగా విడుదలవుతున్నాయి. అత్యవసర కోటా కింద పరికరాలు తీసుకునే వెసులుబాటు ఉన్నా అవి ఇచ్చిన దాఖలాలు లేవు.

ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.260 కోట్లు

ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇప్పటివరకు రూ.260 కోట్లకుపైగా ప్రయివేటు ఆస్పత్రులకు చెల్లించాల్సి ఉంది.

విద్యుత్ బకాయిలు రూ.500 కోట్లు

పలు ప్రభుత్వ శాఖలు, పంచాయతీల పరంగా రూ.500 కోట్ల మేర విద్యుత్ శాఖకు రావాల్సి ఉంది. ఇలాంటి మొండి బకాయిలపై అసలు దృష్టి పెట్టడం లేదు. వీటికి తోడు ఓ వైపు ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు జోరుగా సాగుతోంది.

కాలనీల్లో మౌలిక వసతులు కరువు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వేలాదిగా జగనన్న కాలనీలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ కాలనీల్లో మౌలిక వసతులను కల్పించడంలో అలసత్వం వహిస్తోంది. ఆ కాలనీల వైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితులున్నాయి.

ప్రజాప్రతినిధుల జీతాలకే దిక్కులేదు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జెడ్పీటీసీ, సర్పంచ్‌ల జీతాలకు దిక్కులేదు. ఉమ్మడి జిల్లాలోని 65 మండలా జెడ్పీటీసీలకు నెలకు రూ.6వేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. కానీ అనేక నెలలుగా ఇవి పెండింగ్‌లో ఉండగా ఇప్పటికి రూ.1.7 కోట్లు రావాల్సి ఉంది. అలాగే సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన రూ.3వేల గౌరవ వేతనం కూడా ఇవ్వడం లేదు. వారికి రూ.1.72 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి.

మామూళ్ల మత్తులో ఇంజనీరింగ్ శాఖ

ఇంజనీరింగ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. జిల్లా ఆర్‌అండ్‌బీ పరిధిలో 15 ఏఈలకుగాను ముగ్గురే ఉన్నారు. వీరే అన్ని నియోజకవర్గాలను పర్యవేక్షించాల్సి ఉంది. ప్రతి పనికీ పైసలు ఇవ్వనిదే చేయడం లేదని కాంట్రాక్టర్లు బహిరంగంగా చెబుతున్నారు. సంవత్సరాల కాలంగా ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ శాఖలకు ఇన్‌చార్జి ఎస్‌ఈలే దిక్కుగా మారారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో 50 మంది ఏఈలకు 34 మందే ఉన్నారు. ఇక పంచాయతీరాజ్‌లోనూ ఇన్‌చార్జ్‌ల పాలన సాగుతోంది. ఇక్కడ డీఈలు 15 మందికి గాను ఐదుగురు, 62 మంది ఏఈలకు గాను 37 మంది, ఇంజినీర్ సహాయకులు 504కు గాను 90 మంది కొరత ఉన్నారు. ట్రాన్స్‌కోలోనూ 40 మంది ఏఈలకు గాను దాదాపు 12 మంది తక్కువగా ఉన్నారు.

గజదాడుల కట్టడిలో విఫలం



జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులు(ఫైల్)

జిల్లాలో గజరాజుల దాడులు పెచ్చుమీరుతున్నాయి. కల్లూరు, సోమల, కుప్పం, పలమనేరు, బంగారుపాళ్యం, పుంగనూరు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్, లైటింగ్ ఏర్పాటు చేయాలంటే రూ.20 కోట్లకు పైగా నిధులు అవసరం. ఇందులో చిత్తూరు రేంజ్ పరిధిలో 17 కి.మీ, కుప్పంలో 7 కి.మీ, పలమనేరులో 4 కి.మీ ఫెన్సింగ్ వేయాల్సి ఉంది. సమస్యాత్మకమైన మదుపుటేనుగులను నివారించాల్సిన అవసరం ఉంది.

పరిష్కారం కాని అన్నదాత కష్టాలు

జిల్లాలో అన్నదాతలు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాకు 40,338 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరం కాగా 26,350 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. వ్యవసాయ రుణాలు రెన్యూవల్ చేసుకోవాలంటే అప్పటి వరకు ఉన్న మొత్తాన్ని పూర్తిగా చెల్లించాలని కొత్తగా మెలిక పెట్టారు. జిల్లాలో వేలాది మంది రైతులు వివిధ బ్యాంకుల్లో రూ.3,341 కోట్ల రుణం తీసుకుని అవస్థలు ఎదుర్కొంటున్నారు.

గ్రీన్ అంబాసిడర్ల వెతలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని గ్రీన్ అంబాసిడర్ల జీతాలు మంజూరు చేయడం లేదు. వారికి నెలకు ఇచ్చేది రూ.6 వేలు మాత్రమే. అది కూడా ఇవ్వకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని 1,977 మంది అవస్థలపాలవుతున్నారు. వారికి దాదాపు రూ.కోటి వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

ఫలితం శూన్యం

జెడ్పీ సమావేశాలంటే పలు శాఖల అధికారులకు లెక్క లేకుండా పోయింది. దీనిపై జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీలు హెచ్చరించినా ఫలితం లేకుండా పోతోంది. ముఖ్యంగా ఎన్‌హెచ్‌ఎఐ, అటవీశాఖ, విద్యుత్‌శాఖ, డ్వామా, డీఆర్‌డీఎ, డీఎంఅండ్‌హెచ్, విద్యాశాఖ అధికారులు రావడం లేదు. సోషల్ మీడియా కోసం రీల్స్ పెట్టడానికి కొందరు వీడియోలు చేస్తూ హడావిడి చేస్తున్నారు.

భలే కేటుగాళ్లు..!

- సెల్ ఫోన్లు చోరీ చేసి బ్యాంకు ఖాతాల్లో నగదు హాంఫట్
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 46 సెల్‌ఫోన్లు, రూ.2.8లక్షలు స్వాధీనం
- నిందితులు హైదరాబాద్, అన్నమయ్య జిల్లా, నెల్లూరు వాసులు

తిరుపతి క్రైమ్: సెల్ ఫోన్లు చోరీ చేసి ఆ సెల్ ఫోన్ ద్వారా బాధితుల బ్యాంకు ఖాతాలోని నగదు హాంఫట్ చేస్తున్న కేటుగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఈస్ట్ పోలీస్ స్టేషన్ విలేకరులకు తెలిపిన వివరాలు..హైదరాబాద్‌కు చెందిన హరికృష్ణ, అన్నమయ్య జిల్లాకు చెందిన అశోక్, నెల్లూరు జిల్లాకు చెందిన గడ్డం కసిరెడ్డి ఓ ముఠాగా ఏర్పడి నగరంలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడేవారు. అలా చోరీ చేసిన మొబైల్ ఫోన్లలో ఆ వ్యక్తుల ఫోన్ పే, గూగుల్ పేను పరిశీలించి అందులో నగదును సరికొత్త ఎత్తుగడలతో కొట్టేసేశారు. ఏటీఎం సెంటర్ వద్ద కాపు కాసి, అక్కడ వచ్చే వారికి తమ వారు హాస్పిటల్లో ఉన్నారని, డబ్బులు చాలా అవసరమని ఫోన్ పే చేస్తామని, కావాలంటే కమిషన్ కూడా ఇస్తామని వారిని నమ్మిస్తారు. ఇలా కహానీలు చెప్పి వీరంతా 49 సెల్ ఫోన్లు దొంగతనం చేసి 3.6లక్షలు కాజేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. హరికృష్ణ నుంచి రూ.లక్ష, 40 సెల్ ఫోన్లు, అశోక్ నుంచి రూ.90 వేలు, 6 సెల్ ఫోన్లు, కసిరెడ్డి నుంచి రూ.90 వేలు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ హేమాద్రి, సిబ్బంది కృషి చేశారని డీఎస్పీ వారిని అభినందించారు.

ఎమ్మెల్సీ మేరిగకు పితృవియోగం



మృతి చెందిన మేరిగ ఆనందరావు (ఫైల్)

చిల్లకూరు : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్‌కు పితృవియోగం కలిగింది. రాపూర్‌నకు చెందిన మేరిగ ఆనందరావు (89) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఆయన అకస్మాత్తుగా చివరి శ్వాస విడిచారు. ఆయన భౌతిక కాయాన్ని రాపూరులోని ఆయన స్వగృహానికి నెల్లూరు నుంచి తరలించారు. అంతిమ యాత్ర శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటి వద్ద నుంచి బయలుదేరుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆనందరావు వ్యవసాయ కుటుంబంలో జన్మించినప్పటికీ కొంత రాజకీయ పరిణితి ఉన్నవాడు కావడంతో చదువుతోనే దానిని సాధిచగమని గుర్తించి తన ఐదుగురి సంతానంలో ముగ్గురు కుమారులను వైద్యవృత్తిని చేయించారు. ఈ క్రమంలోనే మేరిగ మురళీధర్‌ను ఉన్నత చదువులు చదివించిన తరువాత ఆయనకు ఇష్టమైన రాజకీయాలలోకి పంపి నేడు ఉన్నతమైన స్థానంలో ఉండేలా ప్రోత్సహించారు. ఆనందరావు మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు మేరిగ మురళీధర్‌కు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

గ్యాస్ పైపులైన్ల తవ్వకాలు నిషేధం

ఓజిలి : మండలంలోని ఓజిలి జాతీయ రహదారి కూడలి వద్ద నుంచి ఏజీపీ గ్యాస్ పరిశ్రమ నుంచి నాయుడుపేట, మేనకూరు ఇండస్ట్రియల్ ఏరియా, అత్తివరం, గూడూరు పరిసర ప్రాంతాల్లో రోడ్డు పక్కనే పైపులైన్లపై తవ్వకాలు నిషేధించినట్లు పరిశ్రమ యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజలు అవగాహన లేకుండా గ్యాస్ పైపులైన్‌పై తవ్వకాలు చేపడుతుండడంతో గ్యాస్ లీకై ఆస్తి నష్టంతో పాటుగా ప్రాణనష్టం జరుగుతుందన్నారు. సమాచారం లేకుండా ఎవ్వరైన జాగ్రత్తలు పాటించకుండా తవ్వకాలు జరిపి ఆస్తి నష్టం కలిగించిన వారిపై పరిశ్రమ యాజమాన్యం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పైపులైన్‌కు దగ్గరగా మరమ్మతులు చేసేవారు పరిశ్రమ టోల్‌ఫ్రీ నంబర్‌కు 18002022999, 72000108123 సమాచారం అందించి సహకరించాలని కోరారు.

ఆర్‌పీఎఫ్ ఉద్యోగికి రాష్ట్రపతి అవార్డు

- రేణిగుంట ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డికి ప్రెసిడెంట్ మెడల్
- కోవిడ్ సమయంలో విదేశాల్లో సేవలకు సత్కారం



రాజగోపాల్‌రెడ్డి

ఏర్పేడు : రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కుక్కాల రాజగోపాల్‌రెడ్డి అందించిన విశిష్ట సేవలను గుర్తించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకమైన ప్రెసిడెంట్ (రాష్ట్రపతి) మెడల్‌ను ప్రకటించింది. బాపట్ల జిల్లా చిన్నగంజాం గ్రామానికి చెందిన కె.సర్వ జనార్దన్‌రెడ్డి, వెంకటరామ తులసమ్మకు ఈయన జన్మించారు. 1991లో ఆయన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) ఎస్‌ఐగా విజయవాడలో మొదట విధుల్లో చేరారు. అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌గా చెన్నై, బెంగుళూరు, సికింద్రాబాద్, భువనేశ్వర్ వంటి ప్రధాన నగరాల్లో విధులు నిర్వహించారు. ఏప్రిల్ నెలలో రేణిగుంటకు బదిలీపై వచ్చారు. ఆయన 2020 నుంచి 2022 వరకు రెండేళ్లు కోవిడ్ క్లిష్ట పరిస్థితుల్లో ఐక్యరాజ్యసమితి శాంతి మిషన్‌లో భాగంగా దక్షిణ సూడాన్, కొసావో దేశాల్లో అక్కడి భద్రతా సిబ్బందితో కలసి పనిచేశారు. అప్పట్లో ఆయన చేసిన సేవలకు నాలుగు ఐక్యరాజ్య సమితి శాంతి పురస్కారాలను అందుకున్నారు. 2012 గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆయన్ను ఇండియన్ పోలీస్ మెడల్‌తో సత్కరించారు. త్వరలో న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రెసిడెంట్ మెడల్ అందుకోనున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుని కుటుంబం

రాజగోపాల్‌రెడ్డి తాత కుక్కాల రాధాకృష్ణారెడ్డి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. రాధాకృష్ణారెడ్డి ఆచార్య ఎన్‌జీ రంగాకు అత్యంత సన్నిహితుడు. స్వాతంత్ర్య సమరయోధుని కుటుంబంలో పుట్టి దేశ సేవలో భాగస్వామిగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న ఘనత రాజగోపాల్‌రెడ్డిది.



కోవిడ్ సమయంలో ఉగాండా దేశంలోని భద్రతా సిబ్బందితో రాజగోపాల్‌రెడ్డి

జెండా రెపరెపలు



జాతీయ జెండా ర్యాలీలో బ్లూమింగ్ బడ్స్ విద్యార్థులు

చంద్రగిరి : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రగిరిలోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాల విద్యార్థులు ఎంఈఓ లలిత ఆధ్వర్యంలో భారీ జాతీయ జెండాతో గురువారం ర్యాలీ నిర్వహించారు. సుమారు 1500 అడుగుల భారీ జాతీయ జెండాతో చంద్రగిరి పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ హితేంద్రనాథ్ రెడ్డితో పాటు ప్రిన్సిపల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.


20న రుణమేళాపై అవగాహన

తిరుపతి కల్చరల్ : జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎంఎస్‌ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన రామానుజ సర్కిల్లో నున్న రెగాలియా హోటల్లో రుణమేళా, కేంద్ర ప్రభుత్వ రాయితీ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరవుతారని, అర్హత కలిగిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించి వారికి తక్షణమే రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ రుణ మేళాలకు హాజరయ్యే వారు ఈనెల 19వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490190498, 7995915450 నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

తిరుమలలో దొంగల చేతివాటం

తిరుమల : పార్కింగ్ లో ఉంచిన కారు అద్దాలు పగులకొట్టి గుర్తుతెలియని దండగులు చోరీకి పాల్పడిన సంఘటన గురువారం వెలుగు చూసింది. తిరుమల టూ టౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు తెలిపిన వివరాల మేరకు తమిళనాడు రాష్ట్రం, వేలూరుకు చెందిన నిత్యవేలు కుటుంబ సభ్యులతో కలిసి కారులో బుధవారం తిరుమలకు చేరుకున్నారు. స్థానిక నారాయణగిరి పార్కింగ్‌లో కారును ఉంచి శ్రీవారి దర్శనానికి వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం వచ్చి చూడగా కారు వెనుక అద్దాలు పగులకొట్టి ఉన్నాయి. కారులోని బ్యాగులో ఉంచిన రెండు జతల కమ్మలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం రప్పించి ఆధారాలు సేకరించారు. చోరీపై భక్తుల ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్కూళ్లను తనిఖీ చేయండి : కలెక్టర్



కలెక్టర్‌ను కలిసిన డీవైఈఓ ఇందిరాదేవి

తిరుపతి అర్బన్: కార్యాలయాలకే పరిమితం కాకుండా స్కూళ్లను తనిఖీ చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఉప విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఇందిరాదేవి గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు కలెక్టర్ మార్గదర్శనంచేశారు. మెనూ ప్రకారం స్కూళ్లలో మధ్యాహ్నం భోజనం పెట్టేలా చూడాలని, నాణ్యమైన విద్య అందేలా చూడాలని ఆదేశించారు.

ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం



తొలి అడ్మిషన్ పొందిన సాయి శ్రీ నిత్యకు ప్రవేశ ధ్రువపత్రాన్ని ఇస్తున్న వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్ వర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. నీట్-2025 ఆల్ ఇండియా కోటాలో విద్యార్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా గురువారం తొలివిడత ప్రవేశాలకు పూనుకున్నారు. కర్నూలుకు చెందిన సాయి శ్రీనిత్య జాతీయ స్థాయిలో 14,255 ర్యాంకు సాధించి తొలి అడ్మిషన్ పొందారు. వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ అడ్మిషన్ ధృవ పత్రాన్ని విద్యార్థినికి అందజేశారు.

జాలర్లకు ఇళ్ల స్థలాలు

తడ : మండలంలోని దీవి గ్రామం ఇరకంలో నివసిస్తున్న జాలర్లకు పూడి గ్రామం వద్ద ఏడాది క్రితం తయారు చేసిన జగనన్న లే అవుట్‌లో 172 మందికి కేటాయించిన ఇళ్ల స్థలాలను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా గురువారం ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. తడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లక్కీడిప్ ద్వారా పట్టాల నంబర్లు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇరకం దీవిలోని ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి పట్టాలు త్వరితగతిన మంజూరు చేశామన్నారు. గ్రామంలో మిగిలిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు కూడా ఇళ్ల స్థలాలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో తిరుపతి ఎంపీ గురుమూర్తి ఫొటో లేకపోవడంతో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టాల పంపిణీ నిలిచిపోయింది. దానిని ఇప్పుడు టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం నాయకులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం కేసులో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్ : ఎర్ర చందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, పంగిలి గ్రామానికి చెందిన నరసింహులుకు ఏడాది జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్ర చందనం కేసుల విచారణ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ గురువారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్లు బాబు ప్రసాద్, రఘు, ఫారెస్ట్ అధికారి చక్రపాణి తెలిపిన వివరాల మేరకు.. 2014 మార్చి 5వ తేదీ నెల్లూరు డివిజన్, రాపూర్ ఫ్లైయింగ్ స్క్వాడ్ ఫారెస్ట్ సిబ్బంది వాహనాల తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ గూడ్స్ క్యారియర్ వాహనం ఫారెస్ట్ సిబ్బందిని చూసి వారికి దూరంగా ఆగింది. వాహనంలోని ముగ్గురు పరారయ్యారు. అయితే వారిలో నిందితుడు నరసింహులును ఫారెస్ట్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వాహనంలోని 436 కిలోల 17 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నరసింహులును విచారించగా మరో ఇద్దరి పేర్లను తెలిపాడు. దీంతో ఫారెస్ట్ సిబ్బంది ముగ్గురుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం నరసింహులుపై మాత్రం రుజువు కావడంతో న్యాయమూర్తి అతడికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మరో ఇద్దరిపై కేసును కొట్టివేస్తూ తీర్పులో పేర్కొన్నారు.

తమిళనాడుకు చెందిన వ్యక్తి..

ఎర్ర చందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో తమిళనాడు, తిరువణ్ణామలై జిల్లా, జమన మాతూరు తాలూకా, కావంబట్టుకు చెందిన చిన్నస్వామికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష ,ఆరు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్ర చందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2020 మార్చి 8వ తేదీ చామల రేంజ్, నాగపట్ల ఈస్ట్ బీట్, విప్పకోన అటవీ ప్రాంతంలో టాస్క్ ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది దుంగలను తరలిస్తుండగా నిందితుడు చిన్నస్వామి పట్టుబడ్డాడు. మిగతావారు పరారీ అయ్యారు. ఫారెస్ట్ సిబ్బంది అతడి వద్ద నాలుగు ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

టెన్త్ ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు, ప్రశాంసాపత్రం ఇస్తున్న కలెక్టర్, క్రెడిట్ యాక్సస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు

తిరుపతి అర్బన్: 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన 8 మంది టెన్త్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున క్రెడిట్ యాక్సస్ ఇండియా ఫౌండేషన్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా నగదుతోపాటు ప్రశాంసాపత్రాలను అందజేసింది. కార్యక్రమంలో క్రెడిట్ యాక్సస్ ఇండియా ఫౌండేషన్ డివిజనల్ మేనేజర్ జగదీష్, స్టేట్ ఆడిట్ హెడ్ షేక్ షమీ, ఏరియా మేనేజర్లు సిద్ధారెడ్డి, ప్రసాద్ రెడ్డి, చలపతి తదితరులు పాల్గొన్నారు.